# మూడో ప్రపంచ యుద్ధం

రిమోట్ నొక్కే చేతికి కంట్రోల్ లేదు. ఆ చేతిని ఆపరేట్ చేస్తున్న మెదడుకీ కంట్రోల్లేదు. మెదడు కంట్రోల్లేని మనిషిలానే వున్నాడు గోపాలకృష్ణ. మనసులోని అసహనమంతా చేతిలో వున్న రిమోట్ మీద కనిపిస్తోంది. ముప్ఫై ఛానళ్ళూ అర్ధగంటలో చుట్టివచ్చాడు. అమెరికా నుండి ఆంధ్రా వరకూ కనురెప్ప కదలికలోనే! నిజంగా అన్ని దేశాలు చుట్టివచ్చినా అంత అలసట వుండదు కాని అలుపు తీరని అలసట ఆ బుల్లితెరతోనే!

రంగురంగుల హరివిల్లు కరెంటు పోయి అదృశ్యమయిపోయింది. కనురెప్పలు అలసటతోనో ఆనందంతోనో... ముద్దాడుకోబోతే లోపలి గుడ్లు భగ్గుమన్నాయి. గోపాల కృష్ణ అలానే కాసేపు కళ్ళు మూసుకున్నాడు. అలాగే సోఫాలో చేరగిలబడ్డాడు. బద్ధకంతో ఒళ్ళు విరుచుకున్నాడు. ఆవలింత తీశాడు. ఇంకా బ్రష్ చేయనందువల్ల పాచినోరు దుర్వాసనతో గుర్తు చేసింది. అయినా లేవలేకపోయాడు. అలాగే సొమ్మసిల్లి పడిపోయాడు.

గోడ గడియారం పన్నెండు గంటలు కొట్టింది. 'పోస్ట్' కేకతో పాటే ఉత్తరం వరండాలోంచి లోపలిగదిలోకి వచ్చి పడింది.

గోపాలకృష్ణ లేవలేకపోయాడు సరికదా కనురెప్పలెత్తి చూడలేదు కూడా. వెయ్యిరాత్రులు జాగారం చేసిన అలసట... వందరోజులు 'ఉపవాసం చేసిన అలసట. గొంతు ఆర్చుకుపోతోంది. దాహంతోనేమో... అంగుటిలోనూ ముక్కురంధ్రాల్లోనూ పొడిబారుతూ మంట బయల్దేరింది. ఎదురుగా రెండడుగుల దూరంలో వున్న టేబిల్ మీద జగ్గుతో మంచినీళ్ళున్నా వెళ్ళి తీసుకోలేకపోయాడు.

అతని పరిస్థితి ఎడారిలో వున్నట్టే వుంది.

ఒయాసిస్సులా అప్పుడే వచ్చాడు హోటల్ కుర్రాడు.

"అయ్యగోరూ భోజనం..." తెచ్చిన కేరియర్ టేబుల్ మీద పెట్టాడు.

"... ని...నీళ్ళు..." చావుబతుకుల్లో వున్నోడు అఖరిగడియల్లో అర్థించినట్టు అర్థించాడు గోపాలకృష్ణ.

కుర్రాడు జగ్గులోని నీళ్ళ గ్లాసులో పోసి అందించాడు.

గోపాలకృష్ణ వణుకుతున్న చేతుల్తో అందుకొని తెల్లటి తీగల్లాగ కట్టిన నోట్లో పోసుకున్నాడు. కొంతనీరు నోట్లోనూ మరికొంతనీరు ముక్కులోనూ పొలమారాడు. గొత్తిలా ఛీదాడు.

కుర్రాడు అలవాటుగా చెప్పక చెయ్యక తన పనయిపోయినట్టు వెళ్ళిపోయాడు.

గోపాలకృష్ణకు కళ్ళలాగే మూతలు పడ్డాయి.

అలా ఎంతసేపు గడిచిందో... అది నిద్రో... మెలకువో... రెండూ కానిదో...?! గడియారం ముల్లు రెండు గంటలు కొట్టేసరికి తెలివిలాంటిది కలిగింది.

కడుపులోని ఆకలి కంయ్‌...కయ్‌మంది. లోపలి ప్రేవుల్నెవరో ముడివేస్తున్నట్టయి లేచి కూర్చున్నాడు. హైడ్రోసిల్ ఆపరేషన్ పేషెంట్‌లా గోడపట్టుకుని బాత్‌రూమ్ వరకు అడుగులు వేశాడు. బ్రెష్షూ పేస్టూ అవసరం లేకుండా చేతివేళ్ళతోనే పళ్ళని తోమి పుక్కిలించాడు. స్నానాన్ని వాయిదా వేశాడో... మరిచిపోయాడో గాని ముఖాన్ని మాత్రం కడుక్కున్నాడు. టవల్‌తో ముఖమయినా తుడుచుకోకుండానే టేబుల్ దగ్గరకి చేరుకున్నాడు. కూర్చీ లాక్కుని కూర్చున్నాడు.

కేరియర్ విప్పి చెయ్యి పెట్టాడు.

కరెంటు వచ్చింది.

బుల్లితెరకి ప్రాణమొచ్చింది. గొంతు విప్పింది.

కళ్ళు తెరకతికించే నాలుగు ముద్దలు మింగాడు. అంతలోనే శక్తి అవహించినట్టు లేచి స్పోర్ట్‌మన్‌లా రిమోట్‌ని తెచ్చుకొని కూర్చున్నాడు. ఎడమ చెయ్యి రిమోట్‌తో కళ్ళకేదో అందిస్తోంటే, కుడిచెయ్యి నోటికందిస్తోంది. అప్పుడప్పుడూ నోరు ఆగుతోంది కాని కన్రెప్ప ఆరడం లేదు.

చెయ్యీనోరూ కంచంలోనే కడిగాడు. ఎంగిలి గిన్నెలు అలాగే వదిలి అదే టేబుల్ మీద వున్న తన అటెండెన్సు రిజిస్టర్ అందుకున్నాడు. పేజీలు తిప్పాడు.

గోపాలకృష్ణ పేరుకెదురుగా శానిటరీ ఇన్స్‌పెక్టరు కెదురుగా ఆరురోజులుగా గళ్ళన్నీ ఖాళీగా వున్నాయి. కేప్ లేకుండా పక్కనే పడివున్న బాల్‌పెన్ తీసి సంతకాలతో గళ్ళన్నీ నింపేశాడు.

ఉద్యోగమయిపోయినట్టు రిజిస్టర్‌ని టేబుల్ మీద మరో మూలకు విసిరేశాడు. లేచి వచ్చి మళ్ళీ సోఫాలో చతికిలపడ్డాడు.

కళ్ళు టీవీ మీదున్నా మనసు మాత్రం మరెక్కడో వున్నట్టుంది. ఎందుకో ఆఫీసు ప్యూన్ తోట రాజు గుర్తుకువచ్చాడు. వాడి మాటలూ గుర్తుకువచ్చాయి.

"రిజిస్టరు మీయింటికాడే వున్నీయండి. దాని తగువేల? మీరు 'ఊ...' అనండి చాలు. జీతంకాక మీ తోటోల్లు పదేసివేలు నెలకు దొబ్బుతుంటే మీరు చదువుకుంటామంటన్నారు. అలాగే కానీయండి. దానికడ్డేటి? మీకెలాగా పిల్లు కెళ్ళడం ఇబ్బందిగుందన్నారు గదా హోటల్‌నుండి కేరీజేర్పాటవీ నేను చూస్తాను. మీరు వారంకీ పదికీ కనిపించండి చాలు..."

గోపాలకృష్ణ ఆలోచనల్ని కత్తిరించినట్టుగయి పోయింది. ఎదురుగా తెరమీది దృశ్యం కట్టి పడేసింది.

స్టారమూవీస్‌లో ఏదో పిక్చరొస్తోంది.

తుపాన్‌లో పడవ కొట్టుకుపోతోంది. సముద్రం భయంకరంగా ఘోషిస్తోంది. కెరటాలు ఉవ్వెత్తున లేచి పడుతున్నాయి.

ఫేను గాలికి గదిలోని ఇందాకటి ఉత్తరం కూడా కొట్టుకుపోతోంది.

... పడవ మీది మనుషులు చచ్చిపోయారు. ఇద్దరు చిన్నపిల్లలే మిగిలారు. వాళ్ళు దీవిలాంటి ఒడ్డుకు చేరుకున్నారు. ఆ ఇద్దరూ పెరిగి పెద్దవాళ్ళవుతున్నారు. ఆడా మగ తెలియనితనంతో పెరుగుతున్నారు వాళ్ళు. అందులో ఆడపిల్ల రజస్వలయింది. భయపడిపోతోంది...

'గోపీ' పిలుస్తూ తలుపు తోసుకుంటూ వచ్చాడు ఆనంద్.

'ఆ' అన్నాడు టీవీ మీదకళ్ళు తియ్యకుండానే గోపాలకృష్ణ. చారబడి వున్నవాడు లేచి కూర్చున్నాడు. ఆనంద్ పక్కనే వచ్చి కూర్చున్నాడు. మాటల్లేకుండా చేసిందేమో టీవీలో దృశ్యం. ఇద్దరూ అందులోనే పడ్డారు.

... మొల మీద తప్ప ఆ యవ్వనవంతులకి ఎక్కడా ఏ ఆచ్ఛాదనా లేదు. ఆ దీవిలో మరో ప్రాణిలేనట్టుంది. పుష్కలమైన పండ్లు పలహారాలు ఆకలేస్తే తినేస్తున్నారు. పరుగులు తీస్తూ ఒకరిమీదొకరు పడుతూ కేరింతలు కొడుతూ. వారి యవ్వనం వారికేదో స్వర్గ లోకి తెచ్చినట్టుగుంది. వాళ్ళ కలయిక ఫలితంగా అమ్మాయి గర్భం దాల్చింది.

"తీస్తే ఇంగ్లీషు వాళ్ళే తియ్యాలి" అన్నాడు ఆనంద్.

గోపాలకృష్ణ నోరిప్పలేదు. కన్నార్పలేదు.

"అదీ ఇలాంటి కలర్ టీవిలోనే చూడాలి. అయినా గోపీ నీలాంటి అదృష్టం అందరికీ రాదురా... ఎంచక్కా బ్యాచిలర్ లైఫ్. నీకు నచ్చిన ఛానెల్ చూడొచ్చు. మాకింట్లో అవదురా... పోనీ ఏ రాత్రిపూటో వేస్తే మా తమ్ముడు తయార్. మా అమ్మ కేకలేస్తుంది" ఆనంద్ ఆనందం కరువైనట్టు నొచ్చుకున్నాడు.

అప్పుడే పనమ్మాయి వచ్చింది. టేబుల్ మీద ఎంగిలి గిన్నెలు తీసి పెరట్లోకి తీసుకుపోయింది.

'ష్' అంటూ నోటిమీద వేలేసుకున్నాడు గోపాలకృష్ణ.

"నువ్వు బుద్ధిమంతుడివి కదూ... మర్చిపోయాను సారీరా"... అని క్షణకాలమాగి "అయినా నీవు 'సివిల్స్' పరీక్షలూ రాసేశావ్. ప్రిపరేషనన్నాళ్ళూ చదువు చదువని చచ్చిపోయావ్.. మరిప్పుడు...'' అడిగాడు ఆనంద్.

"ఇదిగో టీవీ చూస్తే టైంపాసయిపోతోంది.... ఈకాలంలో ఇంతకంటే ఎంజాయ్‌మెంట్ ఏముంటుందిరా..." గోపాలకృష్ణ అన్నాడు.

... ఆ యవ్వనవంతులు మరో పిల్లాడ్నికని దీవి నుండి భూమి మీదకి తిరిగి ప్రయాణమయ్యారు.

సినిమా అయిపోయింది.

ఛానెల్ మారింది.

డిస్కవరీలో తొండ గుడ్లుపెట్టడం చూపిస్తున్నాడు.

పనమ్మాయి కడిగిన గిన్నెల్ని, కేరియర్ కప్పుల్ని గదిలో ఓ మూల బోర్లించి "ఏమండీ... అమ్మగార్నెప్పుడు తీసుకొస్తారండీ... పెళ్ళయి రెండేళ్ళయిపోయింది. ఇదిగో అదిగో అన్నారు గాని ఒక్క దఫాతేలేదేమండి..." టీవీలోకి చూస్తూ అడిగింది.

"....అ...అది...తెస్తాను... తనకి వంట్లో బాగోలేదు..." అన్నాడు గోపాలకృష్ణ. గొంతులో తడబాటు చూసి పనమ్మాయి అడిగింది.

"విశేషమేమయినా వుందేటండీ..." నవ్వింది.

"లేదు...లేదు... అలాంటిదేం లేదు..." గోపాలకృష్ణ మరింత తొట్రుపడ్డాడు.

"ఆఁ...అదేం లేదమ్మాయ్... మీ అయ్యగారికి చేస్తున్న శానిటరీ ఇన్స్‌పెక్టర్ ఉద్యోగంతో కాపరం పెట్టడం ఇష్టంలేదు. రేపోమాపో కలెక్టరు లాంటి పెద్ద పోస్టులోకొస్తే తీసుకొస్తాడు..." ఆనంద్ అసలు విషయం చెప్పాడు.

టైం కావస్తూ వుండడంతో పనమ్మాయి బిందె తీసుకుని నీళ్ళకని వీధిలోకి వెళ్ళింది.

"నిజమేరా... ఓ మంచి పోస్టులో కెళ్ళడమన్నాతప్పేనా? నేను మంచి కెరీర్‌లోకొస్తే వాళ్ళమ్మాయే బాగుపడుతుందన్న కనీసజ్ఞానం మా అత్తమామలకు లేదు. కట్నం డబ్బులు ఎనభైవేలు రెండేళ్ళయి బ్యాలెన్సు బ్యాలెన్సు గానే వుంది. ఇంతదాక ఇవ్వలేదు. దానికి వడ్డీ ఎంత వుతుంది...?" గోపాలకృష్ణ మాట్లాడుతూ ఛానెల్ మార్చాడు 'ఆసియా బిజినెస్ న్యూస్ ఇండియా' పెట్టాడు.

"అందుకనే పద్మని వాళ్ళ అమ్మాళ్ళ ఇంట్లో వుంచేశాను..." గోపాలకృష్ణ మళ్ళీ తనే అన్నాడు.

"నీ బ్యాచులర్ లైఫ్ అందరికీ రాదు..." అభినందించాడు ఆనంద్. అలా బ్యాచిలర్‌గా ఇంకా వుండడం వల్లనే ఎమ్మెస్సీ రోజూ అంతదూరమైనా రాజమండ్రి వెళ్ళి పూర్తి చేయడం అయ్యిందంటూ గోపాలకృష్ణని మెచ్చుకున్నాడు.

ఛానెల్ మార్చాడు గోపాలకృష్ణ.

జెమినీలో 'యువర్స్ లవింగ్లీ' పాట లొస్తున్నాయి.

బోరు కొట్టి మళ్ళీ ఛానెల్ మార్చాడు.

అక్కడ ఈటీవీలో కూడా సినిమా పాటలే వస్తున్నాయి.

మళ్ళీ రిమోట్ నొక్కాడు.

సీటీ కేబుల్ తక్కువ తినలేదు. అక్కడా అవే పాటలు.

పనమ్మాయి నీళ్ళు దించి ఇల్లు వూడ్చింది. ఉత్తరం దొరికితే తీసి టేబుల్ మీద పెట్టింది. తన పనులన్నీ కానిచ్చి 'వస్తాను బాబు' అంటూ వెళ్ళిపోయింది.

అప్పటికే పొద్దు గూకుతోంది.

"గోపీ నే వెళ్తానురా... ఇంట్లో తెలుసుగా..." అని ఆనంద్ సోఫా మీదినుండి లేచి టేబుల్ దగ్గరకు వెళ్ళాడు. టేబుల్ మీద వున్న అద్దంలో ముఖాన్ని తొంగితొంగి చూసుకుని వంగి వంగి తలదువ్వుకుని కురుల్ని సర్దుకున్నాడు.

"ఇదేంటి ఇవాళ మరో కవరొచ్చింది. చింపలేదు ఇంకా చదవలేదా?" అని చేత్తో తీసి చూసి. "ఇదేంటి మూడు కవర్లూ అలాగే వున్నాయి' అడిగాడు ఆనంద్ మళ్ళీ వాటిని టేబుల్ మీద పడేశాడు.

"ఇంటి దగ్గరి కరెంటెఫైర్స్' ఏముంటాయి? చేటభారతాలు తప్ప అబ్బా చదవాలంటే విసుగు" బద్ధకంగా ఆవలింతలు తీశాడు గోపాలకృష్ణ.

ఆనంద్ వెళ్ళిపోయాడు.

గోపాలకృష్ణ మళ్ళీ సోఫాలో చేరబడ్డాడు. కాళ్ళు చేతులూ నిగడదన్ని మరోసారి మరో ఆవలింత తీశాడు. కళ్ళలో ఆవిరి నీటి తెరకట్టింది. ఏదో మత్తుగా వుంది. మెడ పట్టినట్టుగా వుంటే అలాగే తలని తిప్పి రిమోట్‌తో టీవీని ఆపు చేశాడు.

క్షణక్షణానికి నిశ్శబ్దం పెరిగిపోతోంది. అదే నిశ్శబ్దం ఇల్లంతా పాకిపోయి చివరకు గోపాకృష్ణ చెవుల్లోకి దూరింది. ఆ నిశ్శబ్దాన్ని భరిస్తూ వుంటే మెదడు చిట్లిపోతుందా అన్నంత చికాకు కలిగింది. తట్టుకోలేక అటూ ఇటూ దొర్లాడు. వల్ల కాలేదు. తలుపులు మూస్తే గాలి ఆడకుండా ఎలా వుంటుందో టీవీని ఆపితే అలా వుంది. లేచి గది దాటి వరండా దాటి మెట్లమీద నిలబడ్డాడు.

వీధివీధంతా అదే నిశ్శబ్దంతో అలికి ముగ్గేసినట్టుంది. ఎవరి ఇళ్లల్లో వాళ్ళు బుల్లి బుల్లి పెట్టెల ముందు బుద్ధిమంతుల్లా కూర్చున్నారో ఏమో ఎక్కడా ఒక మనిషి తిరిగిన అలికిడి లేదు.

గోపాలకృష్ణ టీవీ ముందు కూర్చున్నాడు.

రిమోట్‌తో ప్రాణమిచ్చాడు. ఇక టీవీయే తన ప్రాణాన్ని చేతుల్లోకి తీసుకుంది. దోలలాడించి ఊలలాడించి ఎక్కడెక్కడికో తీసుకుపోయింది. పరిసరాలను మరిపింపచేసింది. మధ్యలో వచ్చిన టిఫిన్ పేకేజీ ఇబ్బంది కాలేదు.

గోపాలకృష్ణ లోని చలనమంతా టీవీలోని మనుషులు లాక్కున్నారేమో, జీవం లేనట్టు పడివున్నాడు అది భరించలేక గడియారం ఎన్నోసార్లు గుండె బాదుకుంది.

డిడి వన్‌లోహిందీ పిక్చరూ డిడి టూ లో ఇంగ్లీషు పిక్చరూ- డిడి త్రీలో హిందీ పిక్చరూ- డిడి త్రీ మూవీ క్లబ్‌లో ఒక ఇంగ్లీషూ ఇంకో మూడు హిందీ పిక్చర్లూ- ఇంకా జీ టివీలో ఓ హిందీ పిక్చరూ, హోమ్ టీవీలో ఓ హిందీ పిక్చరూ- సన్ టీవీలో తమిళ పిక్చరూ- అసియా నెట్‌లో మళయాళం పిక్చరూ- జీ సినిమాలో, స్టార్ మూవీలో లెక్కేలేదు. రాత్రి తెల్లవార్లూ- వాటికితోడు డిడి ఎయిట్‌లోనూ జెమినిలోనూ ఈటీవీలోనూ సిటీకేబుల్‌లోనూ రెండేసి చొప్పున తెలుగు సినిమాలు. అదేదో సి.వి.ఓ.- ఇన్‌కేబుల్ మరో నాలుగు సినిమాలూ... ఏటిఎన్ ... ఇయర్... ఎన్ఇపిసి... మొత్తం కలిసి యాభై రెండు సినిమాలతో ఒక్కరోజే తెల్లవారింది. అలాగ ప్రతిరోజూ తెల్లవారడానికి ఇరవైనాలుగ్గంటలు కాక యాభై రెండు సినిమాల్తో కాలం కొలుచుకుంటోంది.

తెలతెలవారుతుంటే గోపాలకృష్ణకు రెప్పలు మూతపడి, నిద్ర పట్టింది.

గడియారం ఎప్పటిలాగే మధ్యాహ్నం పన్నెండు గంటలు కొట్టగానే కనురెప్పలు కదుల్తున్నాయి. మనిషి కదలలేకపోతున్నాడు. కడుపులోని ప్రేవులు ఆకలికి మెలిపెడితే- గడియారం తోడైతే ... మరో రెండు గంటలు కొడితే అప్పటికి లేచి నీరసంగా గోడ పట్టుకుని బాత్ రూమ్ దాకా నడచి నోరు పుక్కిలించి వచ్చి వచ్చిన కేరేజు ఖాళీ చేసి...

గడియారంలోని ముళ్ళు గుండ్రంగా తిరిగినట్టే- భూమి గుండ్రంగా తిరిగినట్టే గోపాలకృష్ణ దినచర్యలు కూడా! ఏదీ అర్డరు తప్పడం లేదు.

ఎవరో వచ్చిన మిత్రులూ కరెంటుపోయినపుడు తప్ప మూగవాళ్ళవుతున్నారు.

అవాళ పొద్దు గూకు తుండగా ఎదురింటి అవినాష్ గోపాలకృష్ణ దగ్గరకు 'నమస్తే అంకుల్' అంటూ వచ్చాడు.

ఏమిటన్నట్టుగా చూశాడు సోఫా లోంచి లేవకుండానే గోపాలకృష్ణ.

"అంకుల్... రేపు మా స్కూల్లో లెటర్ కాంపిటిషన్ వుంది... అమ్మకో నాన్నకో అక్కయ్యకో మామయ్యకో ఎవరికో ఒకరికి ఏదో ఒక విషయం మీద లెటరు రాయాలి. కొద్దిగా చెప్పరూ..." బుంగమూతి పెట్టాడు అవినాష్.

గోపాలకృష్ణ కళ్ళతో పాటు నోటిని టీవీ కుట్టేసినట్టే వుంది.

భర్తకు తెలియకుండా ప్రియుడి సరసాలలో కథానాయిక మునిగితేలి, చూసే గోపాలకృష్ణనూ ముంచెత్తుతోంది.

"మా ఏడో తరగతి వాళ్ళకే ఈ ఉత్తరాల పోటీ..." అవినాష్ మళ్ళీ చెప్పాడు. తను రాసుకొచ్చిన ఉత్తరం చూపించాడు.

అంత తొందరగా వదిలేలా లేడని గోపాలకృష్ణ నీరసంగా లేచి కూర్చున్నాడు. అవినాష్ రాసిన ఉత్తరం అందుకున్నాడు. ఏ ఆచ్ఛాదనా లేని ఇంగ్లీష్ హీరోయిన్ గుండెల మీదినుంచి చూపుని బలవంతంగా తిప్పాడు.

కాగితం మీద అక్షరాల వెంట చూపు బద్ధకంగా నడిచింది. మూడు నెలల నుంచి అక్షరం ముట్టని కారణంగానో- టీవీని తప్ప మరి దేన్నీ చూసే అలవాటు లేని కారణంగానో చదవడానికి చికాకేసింది. ముత్యాల్లాంటి అక్షరాలు మసిబారినట్టనిపించి అలాగే కూర్చున్నాడు. ఆ మనిషిలాగే కళ్ళూ కదలడం లేదు.

''మీ లెటర్స్ ఏమన్నా వుంటే ఇవ్వండంకుల్ చూసి తెలుసుకుంటాను'' అవినాష్ అడిగాడు.

గోపాలకృష్ణ నుండి ఏ సమాధానమూ రాకపోవడమే ఆమోదంగా భావించి చనువుగా టేబుల్ దగ్గరకు వెళ్ళాడు.

గోపాలకృష్ణని బుల్లితెర మళ్ళీ లాక్కుంది.

అవినాష్‌కి పాత ఉత్తరాలేవీ దొరకలేదు. ఇంకా ఓపెన్ చెయ్యని మూడు కవర్లు మాత్రం టేబుల్ మీద అలాగే వున్నాయి.

ఎందుకో వాటిని ఓపెన్ చేసి చదవాలనిపించింది అవినాష్‌కి. ఒకసారి గోపాలకృష్ణ వంక చూశాడు.

గోపాలకృష్ణ రెప్పలార్పకుండా టీవీనే చూస్తున్నాడు.

''అంకుల్ ఈ ఉత్తరాలు చదవనా?''

అవినాష్ మాటకు అవునని కాని కాదనికాని సమాధానం రాలేదు. అటూ ఇటూ చూసి ఒక్కో ఉత్తరం విప్పి చదివాడు. ఆఖరి ఉత్తరం చదివి కొయ్యబారిపోయాడు. అలాగే నిల్చుండిపోయాడు తేరుకొని మళ్ళీ మళ్ళీ చదివాడు. కొద్ది సేపటికి కవర్ని పట్టుకుని గోపాలకృష్ణకు దగ్గరగా వచ్చి పక్కనే నిలుచున్నాడు.

టీవీలో- ఇందాకటి హీరోయిన్, ప్రియుడూ కలిసి ఆమె భర్తని చీల్చేస్తున్నారు. ఎర్రటిరక్తం వాళ్ళిద్దరి ముఖాలమీదికి తుళ్ళింది. ఆ భర్త కాళ్ళూ చేతులూ తన్నుకుంటూ హృదయవిదారకంగా అరుస్తూ విలవిలలాడుతున్నాడు.

గోపాలకృష్ణ తన కాళ్ళ దగ్గరే వున్న బిస్లరీ బాటిల్‌నీ చేత్తో అందుకొని గొంతులో నీళ్ళు పోసుకున్నాడు. లీనమయివుండడం మూలానేమో నీళ్ళు పట్టు తప్పి గడ్డం మీదినుండి జారి గుండె మీద పడ్డాయి.

''అంకుల్...''

''అంకుల్...''

అవినాష్ పిలుస్తూనే వున్నాడు.

గోపాలకృష్ణకు వినిపించలేదో... పట్టించుకోలేదో అ అబ్బాయికి అర్థం కాలేదు.

''ఈ ఉత్తరం చదువంకుల్... అంకుల్'' అవినాష్. కవర్ని చేతిలో పెట్టాడు.

గోపాలకృష్ణ చికాకుగా చూశాడు. తర్వాత చదువుతానన్నట్టుగా వుందా చూపు.

"మీ అమ్మ చనిపోయిందంట అంకుల్..."

గోపాలకృష్ణకు ఏమివిన్నాడో అర్థం కాలేదు. ఉత్తరాన్ని చదివాడు. ఆ ఉత్తరం చదివాక మిగతా ఉత్తరాన్ని చదివాడు. రెండు ఉత్తరాల్లో ఆరోగ్యం బాగులేదని, రమ్మనమని. మూడో ఉత్తరంలో ఆయస్సు పోయిందని...

"మీకు టెలిగ్రామొచ్చిందండి. ఈ నాల్రోజులూ సెలవులొచ్చాయి. నేను వూరెళ్ళి పోయాను. మీ ఇల్లుకోసం మావోడు వెతికాడు దొరకలేదట. మర్చిపోయి ఇదిగో ఇప్పుడు తీసి ఇచ్చాడు. అదయినా నేను అడిగితే..." తోటరాజు సంజాయిషీ ఇస్తూనే వున్నాడు. గోపాలకృష్ణ సోఫాలో కూలబడ్డాడు.

బుల్లి పెట్టె అందరి నోళ్ళూ మూయించి తనే మాట్లాడుతోంది.

గోపాలకృష్ణ కళ్ళు అనుకోకుండానో అలవాటు గానో టీవీ మీదికే వెళ్ళాయి.

... విలవిలలాడిపోతున్న మనిషిని ఇంకా కత్తులతో పొడిచి పొడిచి అలసిపోయి, విసిగి చివరకు అవయవాలు తెగ్గోస్తున్నారు.

అదే సినిమాలో అప్పటికి తొమ్మిది హత్యలు చూసాక, ఆ చావు ఏమంత భయపెట్టలేదు. బాధ పెట్టలేదు. అసలా సమయంలో ఏ చావైనా ఏమీకానట్టే వుండి, ఇప్పుడు తల్లి చావూ ఒక మామూలు విషయంగానే వున్నట్టు ఏ స్పందనా లేక ప్రశాంతంగా వున్నాడు గోపాలకృష్ణ. రాగద్వేషాలు లేని యోగిలా వున్నాడు. సర్వం పరిత్యజించిన త్యాగిలా వున్నాడు అవినాష్ కళ్ళకి.

గోపాలకృష్ణ ఎక్కడి ఆలోచనో... ఇక్కడి దృశ్యమో... ఒళ్ళొకసారి జలదరించింది. ఆ జలదరింపు తీరిపోగానే ఇంకే భావమూ లేనట్టు ఆలోచనలు తెగిపోయాయి. బుల్లితెరనిండా ఎర్రని పెదవులు చప్పరించుకుంటూ... అంతలో పెదవి తెగిందేమో హాయిగా ఓ మూలుగు...

'ది' ఎండ్

ఎండ్ లేనట్లు...

తెరమీది ఛానెల్ మారింది.

రిమోట్‌ని చేతివేళ్ళు ఆపరేట్ చేస్తున్నాయో... చేతివేళ్ళని రిమోట్ ఆపరేట్ చేస్తున్నదో- ఇంత చూసినా అర్థం కాలేదు అవినాష్, తోటరాజులకి!

★ ★ ★

*ప్రచురణ : సుప్రభాతం 05 జూన్, 1997*

*రచనా కాలం : 05 ఏప్రిల్, 1997*